

E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 21-09-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



23 నుంచి ట్రూ కలర్స్ ఐపీఓ » 3లో

## సూర్య నిర్ణయం సరైందే: సన్నీ
» 6లో




## లాల్.. సలామ్
» 5లో



## 700కి పైగా ఉత్పత్తుల ధరలను తగ్గించిన అమూల్..!
» 4లో




## 413 పరుగుల ఛేదనలో అద్భుత పోరాటం
» 6లో



# హెచ్1బీ పిడుగు




» వార్షిక వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు
» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం
» భారత ఐటీ ఉద్యోగులపై పెను ప్రభావం
» టెక్ కంపెనీల్లో కలవరం
» తక్షణం యూఎస్‌కు వచ్చేయాలంటూ ఉద్యోగులకు ఈ మెయిళ్లు
» దీంతో విమానాశ్రయాల్లో రద్దీ
» భారీగా పెరిగిన విమాన టికెట్ రేట్లు
» ఈ నిర్ణయం కొత్త వీసాదారులకు మాత్రమే
» వివరణ ఇచ్చిన వైట్‌హౌస్
» ఈ గందరగోళాన్ని అమెరికా పరిష్కరిస్తుందని భావిస్తున్నాం: భారత్
» న్యూయార్క్/వాషింగ్టన్
» ఈ-కబురు,

అత్యుత్తమ నైపుణ్యాలున్న వ్యక్తులను అమెరికాకు రప్పించేందుకు హెచ్1బీ వీసా పథకం తెచ్చాం. ఇది దుర్వినియోగం అవుతోంది. తక్కువ వేతనాలు, తక్కువ నైపుణ్యం ఉన్న వారు అమెరికాకు వస్తున్నారు. వీసా మోసాలకు, మనీలాండరింగ్ లాంటి కార్యకలాపాలకూ ఈ పథకం వేదికవుతోంది.
ట్రంప్

ఉత్తర్వులో ఏముందంటే...
అమెరికాలోకి ప్రవేశించే హెచ్1బీ వీసాదార్ల పిటిషన్లను నియంత్రిస్తున్నాం.
నిబంధనలకు లోబడి లక్ష డాలర్లు చెల్లించిన వారి పిటిషన్లను అనుమతిస్తాం.

తరువాయి 2లో



## 23న మేడారం వెళ్లనున్న ముఖ్యమంత్రి

» అక్కడే డిజైన్లను ఖరారు చేయనున్న రేవంత్‌రెడ్డి
» పనుల నిర్వహణకు సాంకేతిక కమిటీ వేయాలని ఆదేశం

ఈకబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 23న మేడారం వెళ్లనున్నారు. వనదేవతల ఆలయ అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిస్థితుల్ని పరిశీలిస్తారు. జాతర పనులపై అక్కడే సమీక్షిస్తారు. సమ్మక్క, సారలమ్మ పూజారులను సీఎం సంప్రదిస్తారు. వారి ఆమోదం మేరకు ఆలయ అభివృద్ధి డిజైన్లను అక్కడే ఖరారు చేస్తారు. సీఎంతోపాటు మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మేడారం వెళతారు.

## కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

» సీజేతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లు శనివారం ఇక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో భేటీ అయ్యారు. పలు జిల్లాల్లో కోర్టులు అద్దె భవనాల్లో నడుస్తున్న విషయాన్ని సీజే ప్రస్తావిం

తరువాయి 2లో

## పరాదీనతే ప్రబల శత్రువు

» విశ్వబంధువైన భారత్‌కు విరోధులు లేరు
» ఇతర దేశాలపై ఆధారపడటమే మనకున్న అతిపెద్ద అడ్డంకి
» హెచ్–1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందన
» ఆత్మనిర్భరతే అసలైన పరిష్కారమని హితబోధ



ఈ కబురు, భావ్‌నగర్ (గుజరాత్): హెచ్-1బీ వీసాల దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయుల నెత్తిన భారీ పిడుగు పడేసిన నేపథ్యంలో భారత ప్రధాని మోదీ హితబోధ ధోరణిలో స్పందించారు. శనివారం గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో రూ.34,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి తర్వాత 'సముద్రం నుంచి సమృద్ధిదాకా' కార్యక్రమంలో మాట్లాడారు. "విశ్వబంధు భావనతో భారత్ దూసుకుపోతోంది.
అందరితో మిత్రత్వం, సత్సంబంధాలు కోరుకునే, కొనసాగించే భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేకంగా శత్రువంటూ ఎవరూ లేరనే చెప్పాలి. కానీ ఇతర దేశాలపై ఆధారపడటం అనే వైఖరి మనకు పెద్ద శత్రువులా తయారైంది. ఇలా మనపై పైచేయి సాధిస్తున్న పరాదీనతను మనందరం కలసికట్టుగా ఓడిద్దాం. విదేశాలపై అతిగా ఆధారపడితే అంతగా స్వదేశం విఫలమవుతుంది. విశ్వశాంతి, శ్రేయస్సు, సుస్థిరత కోసం పాటుపడే దేశం కచ్చితంగా స్వయంసమృద్ధిని సాధించాలి. స్వావలంబన సాధించకుండా ఇతర దేశాలపై ఆధారపడితే జాతీయ ఆత్మగౌరవం అనేది దెబ్బతింటుంది" అని మోదీ అన్నారు.

140 కోట్ల ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టబోం

"140 కోట్ల ప్రజల భవిష్యత్తును విదేశీ శక్తుల చేతుల్లో పెట్టబోం. విదేశీ పరాదీనత అనేది మన జాతీయాభివృద్ధిని నిర్దేశిస్తుందంటే అస్సలు అంగీకరించబోం. మన భావితరాల భవిష్యత్తును ఇతరుల చేతికి అందించబోం. ఏకంగా 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఇతర దేశాలపై ఆధారపడితే జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టినట్లే లెక్క. ఒక సామెతలాగా చెప్పాలంటే 100 సమస్యలకు ఒకే పరిష్కారం ఉన్నట్లు.. భారత్ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారం ఉంది. అదే ఆత్మనిర్భరత" అని మోదీ ఉద్ఘాటించారు.

తరువాయి 2లో

## టోల్‌ప్లాజా వద్ద దసరా రద్దీ



పండుగకు జనం స్వగ్రామాల బాట

చౌటుప్పల్ రూరల్: ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో పాటు ఆదివారం బతుకమ్మ పండుగ ఉండడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్నవారు.. శనివారం సాయంత్రం నుంచి స్వగ్రామాలకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. వాహనాలు భారీగా రావడంతో హైవేపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. పంతంగి టోల్‌ప్లాజాలో శనివారం సాయంత్రం వాహనాలు కిక్కిరిశాయి. విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ఎనిమిది విండోల ద్వారా వాహనాలను టోల్ సిబ్బంది పంపించారు.

తరువాయి2లో

## యువతను విస్మరిస్తే ఉద్యమాలు

» యువత ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవాలి
» పాక్‌తో కాదు.. పశ్చిమ దేశాలతో పోటీపడాలి
» మందిరం, మసీదు కాదు.. మౌలిక వసతులే ముఖ్యం
» తెలంగాణలో రీకాల్, రీగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది
» ఎన్డీటీవీ యువ –2025లో బీఆర్ఎస్ నేత కేటీఆర్




ఈకబురు, హైదరాబాద్: యువత ఆకాంక్షలను విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని అంటుతుండగా పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ మందిర్- మస్జిద్ పేరిట ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారని మండిపడ్డారు. ముంబైలో శనివారం సాయంత్రం జరిగిన 'ఎన్డీటీవీ యువ 2025' సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. 'దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రధాని మోదీ గాలికొదిలేశారు. చైనా, జపాన్‌తోపాటు అమెరికా వంటి పశ్చిమ దేశాలను అధిగమించే ప్రయత్నం చేయకుండా మనకంటే వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. జెన్ జీ శక్తిని తక్కువగా అంచనా వేయొద్దు 'ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కాకుండా సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలి. జెన్ జీ శక్తిని పాలకులు తక్కువగా అంచనా వేయొద్దు. తెలంగాణలో 400 ఎకరాల అటవీ భూమిని అమ్మే ప్రభుత్వ ప్రయత్నాలు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటంతో నిలిచిపోయింది. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత రాజకీయాల్లోకి వచ్చి భవిష్యత్తు నిర్ణేతలు కావాలి. దేశంలోని యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు. అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్ కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించింది' అని కేటీఆర్ గుర్తు చేశారు.

తరువాయి 3లో

## కర్ణాటక సీఐడీకి సమాచారం ఇవ్వని ఈసీ



» 2లో



## ఈ నెలలో అదనంగా 1.17 లక్షల టన్నుల యూరియా.

» రాష్ట్రానికి ఇప్పటికే 1.44 లక్షల టన్నులు వచ్చాయి..
» మంత్రి తుమ్మల వెల్లడి

తరువాయి2లో

## వచ్చేవారమే 'స్థానిక' నోటిఫికేషన్?



» ఎన్నికలకు వెళ్లటానికే ప్రభుత్వం మొగ్గు
» మంత్రులతో సమావేశంలో సీఎం కీలక నిర్ణయం
» నేడు జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్
» బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై త్వరలో జీవో!
» ఆ వెంటనే ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ జారీ

» 3లో

## తొక్కుకుంటూ పోతేనే తొవ్వ దొరుకుతుంది



» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
» రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. కల్పించుకోవాలి... కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయానికి రాలేదు
» బీఆర్ఎస్ నేతలతో పాటు అనేక మంది టచ్‌లో ఉన్నారు

తరువాయి 2లో

ఈ-కబురు
21- 09 -2025
ఆదివారం
e-kaburu.com

మొదటి పేజి తరువాయి

# ఈ నెలలో అదనంగా 1.17 లక్షల టన్నుల యూరియా.

**రాష్ట్రానికి ఇప్పటికే 1.44 లక్షల టన్నులు వచ్చాయి..**

**మంత్రి తుమ్మల వెల్లడి**

ఈకబురు,హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు యూరియా సరఫరాపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, ఈ నెలలో 1.70 లక్షల టన్నుల కేటాయింపులకు అదనంగా 1.17 లక్షల టన్నులు ఇచ్చేందుకు అంగీకరించిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన సచివాలయంలో యూరియా సరఫరాపై సమీక్షించారు. "రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరం వినతులు పంపడంతో పాటు ఢిల్లీ వెళ్లి ప్రత్యక్షంగా మంత్రులను పలుమార్లు కలసి అభ్యర్థించాం. రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతతో ఏర్పడిన ఇబ్బందులను వివరించాం. వీటన్నింటిపైనా కేంద్రం సానుకూలంగా స్పందించింది. సెప్టెంబరులో మొత్తం 2.87 లక్షల టన్నుల సరఫరాకు అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఇందులో 1.44 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయి. అదనంగా కేటాయించిన దిగుమతి యూరియాలో 60 వేల టన్నులు రవాణాలో ఉంది. వివిధ పోర్టుల నుంచి ఒకట్రెండు రోజుల్లో చేరుకుంటుంది. వారం రోజుల్లో మరో 50 వేల టన్నులు... ఆ తర్వాత మూడు రోజులకు 33 వేల టన్నులు వస్తాయి" అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



# తొక్కుకుంటూ పోతేనే తొవ్వ దొరుకుతుంది



ఈకబురు,హైదరాబాద్: రాజకీయాలు, ప్రజా జీవితంలో ఎవరూ అవకాశం (స్పేస్) ఇవ్వరని, తొక్కుకుంటూ వెళ్తేనే తొవ్వ దొరుకుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తాను రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా పూర్తి నిర్ణయానికి రాలేదని తెలిపారు. భవిష్యత్తులో రాజకీయంగా ఎలా అడుగులు వేయాలనే అంశంపై వివిధ వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. తాను పార్టీ పెడితే బీసీలకు చట్ట సభల్లో 42 శాతం రిజర్వేషన్లతో పాటు అన్ని వర్గాలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. శనివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్ అనంతరం మీడియా ఇష్టాగోష్టిలో కవిత వివిధ అంశాలకు సంబంధించి పలు వ్యాఖ్యలు చేశారు. 'నేను ఇప్పుడు ఫ్రీ బర్డ్. నన్ను బీఆర్ఎస్ సహా అనేక మంది నేతలు కలుస్తున్నారు. నేను కూడా పలువురితో సంప్రదింపులు జరుపుతున్నా. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదు' అని కవిత వ్యాఖ్యానించారు.

**కాళేశ్వరం.. మినహా హరీశ్‌పై కోపం లేదు**

'నీటి పారుదల శాఖకు సంబంధించిన ఫైళ్లను సరైన ప్రొసీజర్ పాటించకుండా నేరుగా సీఎంకు పంపడంపై 2016లోనే నేను కేటీఆర్‌ను అప్రమత్తం చేశా. కాళేశ్వరం ప్రాజెక్టు అంశం మినహా మాజీ మంత్రి హరీశ్‌రావుపై నాకు ఎలాంటి వ్యక్తిగత కోపం లేదు. కింది స్థాయిలో అధికారుల పరిశీలన, ఆమోదం లేకుండా ఫైళ్లు కేసీఆర్ వద్దకు వెళ్లాయి. పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇదే విషయాన్ని ఎత్తి చూపింది. విచారణ సందర్భంగా అంతా కేసీఆర్ నిర్ణయమే.. అని హరీశ్‌రావు చెప్పినట్లు కమిషన్ నివేదికలో ఉంది'అని కవిత అన్నారు.

**కృష్ణాలో క్రికెట్ ఆడుకోవాలి..**

'కృష్ణా నదిపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే తెలంగాణ ప్రాంత వాసులు నదిలో క్రికెట్ ఆడుకోవాల్సిందే. ఆల్మట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్ర అభ్యంతరం చెప్పినా తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది. రేవంత్‌రెడ్డి.. సోనియా ద్వారా కర్ణాటకపై ఒత్తిడి పెంచాలి. బనకచర్లతో పాటు ఆల్మట్టిపైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. ఈసారి మా ఊరు చింతమడకలో బతుకమ్మ ఉత్సవాలకు వెళ్తున్నా'అని కవిత పేర్కొన్నారు.

# 23న మేడారం వెళ్లనున్న ముఖ్యమంత్రి



వారి ఆమోదం మేరకు ఆలయ అభివృద్ధి డిజైన్లను అక్కడే ఖరారు చేస్తారు. సీఎంతోపాటు మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మేడారం వెళతారు. మేడారం అభివృద్ధి ప్రణాళికపై సీఎం శనివారమిక్కడ అధికారులతో సమీక్షించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాంనాయక్, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "మేడారం జాతర పనులకు సంబంధించి టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయండి. ఆలయ ఆవరణను మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. గద్దెలను యథాతథంగా ఉంచి, పూజారుల సూచనల ప్రకారమే సంప్రదాయాలను గౌరవిస్తూ పనులు చేపట్టాలి. గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా స్వాగత తోరణం డిజైన్లు ఉండాలి. ఆలయ పరిసరాల్లో ఆ ప్రాంత సంప్రదాయ వృక్షాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.

# కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం



ప్రస్తావించారు. కొత్త జిల్లాల్లో నూతన భవనాల నిర్మాణంతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ గత ఏడాది కాలంలోనే న్యాయ వ్యవస్థకు రూ.1,050 కోట్ల దాకా కేటాయించినట్లు తెలిపారు. న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పరిస్థితులను పరిశీలించి అవసరమైన జిల్లాల్లో కొత్త భవనాల ఏర్పాటుతోపాటు సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా కొన్ని కోర్టుల్లో అవసరానికి మించి సిబ్బంది ఉంటున్నారని, మరికొన్ని చోట్ల తక్కువగా ఉంటున్నారని, దీన్ని హేతుబద్ధీకరించాలని సీఎం సూచించారు. ఈ భేటీలో హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యాం కోశీ, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, రిజిస్ట్రార్ జనరల్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజి తరువాయి

# కర్ణాటక సీఐడీకి సమాచారం ఇవ్వని ఈసీ



**ఈ-కబురు,వయనాడ్: లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ కర్ణాటక 'ఓటు చోరీ' వ్యవహారానికి సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ)పై మరోసారి విమర్శలు గుప్పించారు. ఓటు చోరీపై దాఖలైన కేసు విచారణలో భాగంగా కర్ణాటక సీఐడీకి అడిగిన సమాచారాన్ని ఈసీ అందించలేదని ఆయన ఆరోపించారు. తన తల్లి సోనియా గాంధీతో కలిసి వయనాడ్ పర్యటనకై విచ్చేసిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) అయిన జ్ఞానేశ్ కుమార్ సీఐడీ పోలీసులు అడిగిన సమాచారం ఇవ్వడం లేదన్నారు. "సీఈసీ తీరుపై ఇంతకు మించిన అభిశంసన ఇంకేం కావాలి. ఆయన పోలీసులు అడిగిన సమాచారం ఇవ్వడం లేదు. ఇది నేను చేస్తున్న ప్రకటన కాదు. ఇది వాస్తవం" అని రాహుల్ అన్నారు. "వాస్తవాలను బహిర్గతం చేసే హైడ్రోజన్ బాంబును త్వరలోనే పేల్చబోతున్నాం. మేం చెప్పే విషయాలపై బలమైన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. సాక్ష్యాలు లేకుండా మేమేదీ చెప్పడం లేదు" అని రాహుల్ స్పష్టం చేశారు.**

మొదటి పేజి తరువాయి

# హెచ్1బీ పిడుగు

అమెరికాలోకి ప్రవేశించే హెచ్1బీ వీసాదార్ల పిటిషన్లను నియంత్రిస్తున్నాం.

నిబంధనలకు లోబడి లక్ష డాలర్లు చెల్లించిన వారి పిటిషన్లను అనుమతిస్తాం.

ఈ నిబంధనలు అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక 12.01 గంటల నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటాయి.

ప్రస్తుతం అమెరికా బయట ఉన్నవారు లక్ష డాలర్లు చెల్లించకపోతే వారి హెచ్1బీ పిటిషన్లను 12 నెలల వరకు పరిశీలించం.

అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులు సహా ప్రపంచంలోని వివిధ దేశాల వారికి పిడుగులాంటి వార్త. హెచ్1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు)కు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ భారీ పెంపునకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకాలు చేశారు. భారత్‌లో, అందునా తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయం ఈ నెల 21 నుంచి ఒక ఏడాది పాటు అమల్లో ఉండనుంది. ఇది భారత్‌నే కాదు.. చైనా సహా పలు దేశాలనూ ప్రభావితం చేయనుంది. వార్షిక ఫీజు పెంపుతో ఉద్యోగులతో పాటు టెక్ కంపెనీలూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఇతర దేశాల్లో ఉన్న హెచ్1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు తిరిగి రావాలని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సూచనలు జారీచేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం వీరంతా ఆదివారం ఉదయం 9.30 గంటలకల్లా అమెరికా చేరుకోవాలని, లేకపోతే.. పెంచిన హెచ్1బీ వార్షిక ఫీజు ప్రకారం రూ.88 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వార్తలు రావడంతో అగ్రరాజ్యానికి వెళ్లే విమానాల కోసం హెచ్1బీ వీసాదారులు భారీస్థాయిలో విమానాశ్రయాలకు చేరుకుంటున్నారు. మరోవైపు అమెరికాలో అలజడి రేగుతోంది. పండుగలకు భారత్ వెళ్లాలనుకొనే వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. విమానాలు ఎక్కిన వారు కూడా దిగిపోతున్నారు. లక్ష డాలర్ల ఫీజు పెంపుపై అయోమయం నెలకొనడంతో వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. కేవలం కొత్త వీసాదార్లకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని తెలిపింది. "నైపుణ్యమున్న అంతర్జాతీయ ఉద్యోగులను తీసుకొనే సంస్థలు ఏటా ప్రతి ఉద్యోగికి ఈ వీసా ఫీజు కింద ఆరు సంవత్సరాల వరకు లక్ష డాలర్లు చెల్లించాలి. ఈ ఫీజు కొత్త దరఖాస్తుదారులకు మాత్రమే వర్తిస్తుంది" అని వైట్‌హౌస్ ప్రతినిధి తెలిపారు.

**అందుకే ఈ నిర్ణయం: ట్రంప్**

హెచ్1బీ వీసా పథకం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందని ఫీజు పెంపు ఉత్తర్వులపై సంతకం చేస్తూ ట్రంప్ పేర్కొన్నారు. దేశ భద్రతకే ముప్పుగా పరిణమించిందని అన్నారు. హెచ్1బీ వీసాల మాటున కొన్ని సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. ఈ చర్యను టెక్ పరిశ్రమ వ్యతిరేకించబోదని చెప్పారు.

**సింహభాగం భారతీయులే**

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్1బీ వీసాను తీసుకొచ్చారు. యూఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్1బీ వీసాదారుల్లో ఇండియాకు 71 శాతం వాటా, చైనాకు 11.7 శాతం వాటా ఉంది. ఈ ఫీజు పెంపు నేరుగా మన ఐటీ ప్రొఫెషనల్స్‌పై ప్రభావం చూపనుంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు ప్రతి సంవత్సరం వేలాది ఉద్యోగులను అమెరికాకు పంపుతున్నాయి. ఇప్పుడు ఒక్కో ఉద్యోగి కోసం దాదాపు రూ.88 లక్షలు ఖర్చు చేయడం ఆర్థికపరంగా భారంగా మారనుంది.

**తక్షణం తిరిగి వచ్చేయండి**

అమెరికా బయట ఉన్న హెచ్1బీ వీసాదారులు ఆదివారం ఉదయం 9.30 గంటల్లోపు అగ్రరాజ్యానికి చేరుకోవాలని, లేకపోతే లక్ష డాలర్లు (రూ.88 లక్షలు) చెల్లించాల్సి ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇతర దేశాల్లో ఉన్న హెచ్1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు చేరుకోవాలని మైక్రోసాఫ్ట్, మెటా వంటి టెక్ సంస్థలు తమ ఉద్యోగులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. ఇతర దేశాల్లో ఉన్న హెచ్1బీ, హెచ్4 వీసాదారులు ఈ నెల 21 లోపు అమెరికాకు తిరిగిరావాలని కోరుతూ మైక్రోసాఫ్ట్ కూడా తమ ఉద్యోగులకు అడ్వైజరీ జారీ చేసినట్లు తెలుస్తోంది. అమెరికాలోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు మంచి భవిష్యత్తు కోసం అక్కడే పనిని కొనసాగించాలని మైక్రోసాఫ్ట్ సూచించినట్లు తెలుస్తోంది. మరో దిగ్గజ సంస్థ మెటా కూడా తమ ఉద్యోగులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేదా సెలవుల కోసం ఇతర దేశాలకు వెళ్లిన హెచ్1బీ వీసా కలిగి ఉన్న తమ ఉద్యోగులు 24 గంటల్లోగా అమెరికాకు తిరిగి వచ్చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న హెచ్1బీ, హెచ్4 ఉద్యోగులు రెండు వారాలు పాటు ఇతర దేశాలకు వెళ్లొద్దని సూచించింది.

**ధనవంతులకు 'గోల్డ్ కార్డ్'**

హెచ్1బీ వీసాదారులకు వార్షిక ఫీజు భారీగా పెంచిన ట్రంప్.. ధనవంతులైన విదేశీయుల కోసం 'గోల్డ్ కార్డ్' పథకం తెచ్చారు. ఇందులో చేరాలనుకొనే వ్యక్తులు 1 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.81 కోట్లు) అమెరికా ట్రెజరీకి బహుమతిగా చెల్లించాలి. వారినేదైనా కార్పొరేషన్ స్పాన్సర్ చేస్తే రెండు మిలియన్ డాలర్లు (సుమారు 17.62 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద నమోదైన వారికి గ్రీన్‌కార్డ్ కూడా లభ్యం కానుంది. "మేం ఈ పథకం ద్వారా వందలాది బిలియన్ డాలర్లు తీసుకుంటున్నాం. ఈ డబ్బుతో పన్నులు తగ్గిస్తాం, అప్పునూ తగ్గించుకుంటాం" అని ట్రంప్ చెప్పారు.

**అమెరికాలో విదేశీ ఉద్యోగుల శకం ముగిసింది**

**అమెరికా వాణిజ్యశాఖ మంత్రి**

హెచ్1బీ వీసాల వార్షిక రుసుమును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా పెంచడంపై ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి విదేశీ వ్యక్తులు ఉద్యోగాలు లాక్కొనే పద్ధతికి కొత్త వీసా నిబంధనలు ముగింపు పలుకుతాయని వ్యాఖ్యానించారు. తద్వారా అమెరికాకు గణనీయమైన ప్రయోజనం లభిస్తుందని అన్నారు. "కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి ఉద్యోగాలను లాక్కొంటున్న పద్ధతికి ముగింపు పలుకుతాం. ఆర్థిక వ్యవస్థను ఉపయోగించుకొని ప్రతిఫలంగా ఏమీ అందించకుండా పని చేసే కార్మికులను తగ్గిస్తాం. అది దేశానికి గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది" అని తెలిపారు.

**మోయలేని భారం**

హెచ్1బీ వార్షిక ఫీజు పెంపు భారం మోయలేనంతగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో ఒక మధ్యస్థాయి ఇంజినీర్ సంవత్సరానికి 1,20,000 డాలర్లు సంపాదిస్తే.. అందులో లక్ష డాలర్లు వీసా ఫీజు అంటే.. 80 శాతం జీతం అక్కడే పోతుంది. దీనివల్ల అత్యధిక స్థాయిలో వేతనం పొందేవారు మినహా మిగిలినవారు యూఎస్ వలస వెళ్లడం పెనుభారమే అవుతుంది.

అమెరికాలో మాస్టర్స్, పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత హెచ్1బీ వీసాలకు మారే కమ్యూనిటీలో కూడా భారతీయులదే ఆధిపత్యం. ఇప్పుడు ఈ పిడుగు లాంటి వార్త వారి కెరీర్ అవకాశాలకు భారీగా గండి కొట్టనుంది.

**ట్రంప్ నిర్ణయంపై ఎవరు ఏమన్నారు?**

"ఇదొక నిర్లక్ష్యపూరిత ప్రయత్నం. అమెరికా శ్రామిక శక్తిని ఎంతోకాలంగా బలోపేతం చేసి, ఆవిష్కరణలకు దోహదం చేసి, లక్షలాది మంది అమెరికన్లకు ఉపాధి కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో సహాయపడిన అధిక నైపుణ్యం కలిగిన కార్మికులను అమెరికా నుంచి దూరం చేయడమే అవుతుంది"

యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి

"హెచ్1బీ ప్రోగ్రామ్ అనేది ఆవిష్కరణలకు ప్రాణాధారం. దానిద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభను అమెరికా ఆకర్షిస్తోంది. ఈ ఫీజు వల్ల ఇకపై అడ్డంకులు ఎదురుకానున్నాయి. ఆర్థికవ్యవస్థ దూసుకెళ్లేందుకు ఉపకరించే నిపుణులను దూరం చేస్తుంది"

అజయ్ భుటోరియా, జో బైడెన్ మాజీ సలహాదారు

"హెచ్1బీ వీసా వ్యవస్థ అత్యధికంగా దుర్వినియోగం అవుతున్న వలస విధానాల్లో ఒకటి. ఈ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశం అమెరికన్లు పని చేయలేని రంగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీయులను తీసుకురావడం మాత్రమే. ఇప్పుడు కంపెనీలు ఒకరిని స్పాన్సర్ చేయాలంటే 100,000 డాలర్లు చెల్లించాలి. దీంతో వారు తీసుకురాబోయే వ్యక్తులు నిజంగానే అత్యున్నత ప్రతిభావంతులై ఉండాలి"

వైట్ హౌస్ స్టాఫ్ సెక్రటరీ విల్ షార్ప్

"వార్షిక ఫీజు పెంపుతో అమెరికాయే ఉక్కిరి బిక్కిరి కానుంది. ప్రపంచస్థాయి ప్రతిభకు తలుపులు మూసేయడం వల్ల ఆ దేశంలో ఏర్పడాల్సిన ల్యాబ్స్, పేటెంట్లు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు బెంగళూరు, హైదరాబాద్, పుణెలకు వచ్చేస్తాయి. ఈ నిర్ణయం భారత్‌కు లాభం చేకూర్చనుంది"

నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్‌కాంత్

**ఇది కుటుంబాలను గందరగోళానికి గురిచేస్తుంది**

**ఈ సమస్యను అమెరికా పరిష్కరిస్తుందని భావిస్తున్నాం: కేంద్రం**

దిల్లీ: హెచ్1బీ వార్షిక ఫీజు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయం.. మానవతా విపరిణామాలకు దారి తీస్తుందని భారత్ పేర్కొంది. ఈ గందరగోళాన్ని అమెరికా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. "ఈ చర్య కుటుంబాలను గందరగోళానికి గురిచేస్తుంది" అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శనివారం తెలిపారు. అందరితో మాట్లాడి దీని ప్రభావాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని అన్నారు. భారత్, అమెరికాలోని పరిశ్రమలు ఆవిష్కరణల్లో, సృజనాత్మకతలో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని, కాబట్టి ఆ అంశంపై ముందుకు వెళ్లేందుకు సరైన మార్గంలో చర్చలు జరుగుతాయని అనుకుంటున్నామని చెప్పారు. రెండు దేశాల్లోనూ కొత్త సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధి, పోటీతత్వం, సంపద సృష్టికి నైపుణ్యం కలిగిన ప్రతిభ దోహదం చేసిందని అన్నారు. "అందువల్ల పరస్పర ప్రయోజనాలను, ప్రజల మధ్య ఉన్న బలమైన సంబంధాలను దృష్టిలో ఉంచుకొని విధాన నిర్ణేతలు ఈ తాజా పరిణామాలను సమీక్షించాలి" అని జైస్వాల్ తెలిపారు. మరోవైపు ఈ సమస్యను పరిష్కరించడానికి అమెరికా ప్రభుత్వంతో, అక్కడి ఐటీ పరిశ్రమతో కేంద్రం సంప్రతింపులు ప్రారంభించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**ఎన్ని ప్రతిపాదనలో..**

ఈనాడు, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గత జనవరి నుంచి విదేశీ నిపుణులకిచ్చే హెచ్1బీ వీసాలపై పలు ప్రతిపాదనలను ట్రంప్ తెరపైకి తెచ్చారు. ముఖ్యంగా భారతీయ ఉద్యోగులను, విద్యార్థులను కలవరపెడుతూ వచ్చిన ఆయన... చివరికి లక్ష డాలర్ల నిబంధనపై నిర్ణయం తీసుకున్నారు. ఇది అమలవుతుందా.. కోర్టు కేసులతో ఆగుతుందా అన్నది వేచి చూడాలి.

**ఇప్పటివరకు చేసినవి..**

1. హెచ్1బీ వీసాపై విదేశీయులను కంపెనీలు తక్కువ వేతనంతో నియమించుకుంటున్నాయని, దానివల్ల అమెరికన్లకు ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని చెప్పిన ట్రంప్... ఆ వీసాపై తీసుకోవాలంటే కనీస వేతనం పెంచాలని ప్రతిపాదించారు. అది అమల్లోకి రాలేదు.
2. హెచ్1బీ వీసాల జారీకి లాటరీ విధానం ఉండదని ప్రతిపాదించారు. నాలుగు రకాల వేతనాల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. అమెరికాలోని ప్రాంతాలను, ఉద్యోగాలను బట్టి స్థాయుల ఆధారంగా కనీస వేతనం నిర్ణయించి కొత్త విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి వీసాల దరఖాస్తులు ప్రారంభమవుతాయి. అప్పటి నుంచి అమలు చేస్తారా.. లేదా.. అన్నది చూడాలి.

**డ్రాప్ బాక్స్ విధానం రద్దు అమల్లోకి..**

హెచ్1బీ ఉద్యోగులు ఇప్పటివరకూ రెన్యువల్ దరఖాస్తును డ్రాప్ బాక్స్‌లో వేసి వచ్చేవారు. 2025 సెప్టెంబరు 2 నుంచి నుంచి డ్రాప్ బాక్స్ విధానం ఉండదని ట్రంప్ వెల్లడించారు. ఇది అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం విదేశీ నిపుణులకు ఇచ్చిన హెచ్1బీ రెన్యువల్‌కు (మూడేళ్ల తర్వాత) ఒకవేళ కంపెనీ మారితే కచ్చితంగా స్వదేశానికి వచ్చి ఇంటర్వ్యూకు హాజరు కావాలి. అంటే కాన్సులేట్‌లో స్టాంపింగ్ వేయించుకోవాలి. కంపెనీ మారకుంటే స్వదేశానికి వచ్చి ఇంటర్వ్యూ ఇవ్వనవసరం లేదు. కంపెనీ మారకున్నా ఏదైనా పని నిమిత్తం స్వదేశానికి వస్తే... ఇక్కడి కాన్సులేట్‌లో స్టాంపింగ్ తప్పనిసరి. ప్రస్తుతం పలువురు ఇంటర్వ్యూలకు వెళ్తున్నారని కన్సార్షియం ఆఫ్ ఫారెన్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ (సీఎఫ్ఈఏ) కార్యదర్శి, ఐ20 ఫీవర్ కన్సల్టెన్సీ ఎండీ నవీన్ యాతపు తెలిపారు.



# పరాధీనతే ప్రబల శత్రువు



**కాంగ్రెస్‌పై మళ్లీ విమర్శల నిప్పులు**

పనిలోపనిగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీలపై, గత ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. "భారత్‌లో నిగూఢంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసే ప్రయత్నాలు స్వాతంత్ర్యం వచ్చాక ఆరేడు దశాబ్దాలదాకా జరగనేలేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెంచిపోషించిన లైసెన్స్‌రాజ్ వ్యవస్థలో దేశాభివృద్ధి పడకేసింది. లైసెన్స్-కోటా రాజ్యంలో భారత్ విశ్వవిపణిలోకి అడుగుపెట్టలేక ఒంటరిగా మిగిలిపోయింది. ఆ తర్వాత ప్రపంచీకరణ శకం మొదలైనప్పుడు గత ప్రభుత్వాలు తప్పిదాలే చేశాయి.

దేశావసరాలు తీర్చుకునేందుకు స్వావలంబన సాధించాల్సిందిపోయి కేవలం దిగుమతులపైనే దృష్టిపెట్టాయి. దీంతో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు సర్వసాధారణమయ్యాయి. తప్పుడు విధానపర నిర్ణయాల కారణంగా ప్రభ కోల్పోయిన రంగాల్లో నౌకల తయారీ పరిశ్రమ కీలకమైంది. గతంలో భారతీయ తయారీ నౌకలనే మనం ఉపయోగించేవాళ్లం. ఇప్పుడు విదేశాలపై ఆధారపడుతున్నాం. అప్పట్లో ఎగుమతిదిగుమతి సరుకుల్లో 40 శాతం భారతీయ నౌకల్లో జరిగేవి.

ఇప్పుడు కేవలం 5 శాతం నౌకల్లో జరుగుతోంది. మిగతావన్నీ విదేశీ నౌకలే. అందుకే ఏటా ఏకంగా రూ.6 లక్షల కోట్లను వినియోగ ఖర్చుల కింద విదేశీ నౌకల కంపెనీలకు చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఏడు దశాబ్దాల్లో ఎంత చెల్లించామో లెక్కేసుకోండి. ఇంత సొమ్ము విదేశాలకు వెళ్లడంతో ఆయా దేశాల్లో ఉపాధి పెరిగింది. ఇదే సొమ్ములో కొంత అయినా దేశీయంగా పెట్టుబడిగా మార్చి ఉంటే ఎన్ని లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగేవో ఊహించుకోండి. దేశీయ నౌకలనే వినియోగించి ఉంటే ఏటా భారత్ లక్షల కోట్ల ఆదాయాన్ని చవిచూసేది"అని మోదీ వివరించారు.

**షిప్ అయినా చిప్ అయినా ఇక్కడిదై ఉండాలి**

చిప్(సెమీకండక్టర్) కావొచ్చు షిప్ కావొచ్చు. ఏదైనా భారత్‌లోనే తయారు కావాలి. వాటిని మనమే తయారుచేద్దాం. సముద్రవిపణిలో అగ్రగామిగా మారితే అంతర్జాతీయంగా పరపతి ఇనుమడిస్తుంది. ఇందుకు దేశీయనౌకాశ్రయాలే వెన్నుముక. దేశీయ సముద్రనౌకారంగం నవతరం సంస్కరణల దిశగా దూసుకుపోతోంది. పలు రకాల డాక్యుమెంట్లు, పత్రాల సమర్పణ, తనిఖీ వంటి సుదీర్ఘ ప్రక్రియకు దేశంలోని అన్ని ప్రధాన నౌకాశ్రయాల్లో చెల్లుచీటీ రాసేశాం. దీంతో ఒకే దేశం-ఒకే డాక్యుమెంట్, ఒకే దేశం-ఒకే నౌకాశ్రయం విధానంలో వాణిజ్యం, వ్యాపారం సులభతరమవుతుంది"అని అన్నారు.

**రుణాలు ఇక సులువు**

"నౌకల తయారీ సంస్థలకు ఇప్పుడు సులభంగా రుణాలు లభిస్తున్నాయి. తక్కువ వడ్డీ రేట్లకే బ్యాంకల నుంచి రుణాలను పొందగల్గుతున్నాయి. మౌలికవసతుల ఫైనాన్సింగ్ సదుపాయం ఇప్పుడు అన్ని నౌకలతయారీ సంస్థలకు అందుబాటులోకి వచ్చింది. మరో మూడు కీలక పథకాలపై ఎన్‌డీఏ సర్కార్ దృష్టిసారించింది. భారత్‌ను సముద్రయాన శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. రుణలభ్యతతో నూతన సాంకేతికత, ఆధునిక డిజైన్, అత్యున్నత ప్రమాణాలను సంస్థలు అందిపుచ్చుకుంటాయి. త్వరలో ఈ రంగంలో ప్రభుత్వం రూ.70,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది"అని మోదీ అన్నారు. కార్యక్రమాల్లో భాగంగా రూ.7,870 కోట్ల విలువైన సముద్రయానసంబంధ అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేశారు. వీటికితోడు గుజరాత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టబోయే రూ.26,354 కోట్ల విలువైన ఇతర ప్రాజెక్టుల ప్రారం□ోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లోనూ మోదీ పాల్గొన్నారు. అహ్మదాబాద్‌కు 100 కిలోమీటర్ల దూరంలోని గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామికప్రాంతమైన ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో హెలికాప్టర్‌లో విహంగవీక్షణం చేశారు. అహ్మదాబాద్‌లోని లోథల్‌లో భారతీయ సముద్రయాన వారసత్వాన్ని చాటే నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ నిర్మాణపనులనూ మోదీ పర్యవేక్షించారు. అంతకుముందు ఆయన భావ్‌నగర్‌కు చేరుకోగానే రోడ్‌షోలో పాల్గొన్నారు.

# హెచ్ సి యు స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ ఘనవిజయం



సంబరాలు జరుపుకుంటున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం విద్యార్థులు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ విద్యార్థి సంఘం అఖండ విజయం సాధించింది. అధికారిక స్టూడెంట్ యూనియన్ కోసం జరిగిన ఎన్నికల్లో ఏబీవీపీ - ఎస్ ఎల్ విడి విద్యార్థి సంఘాలు కూటమిగా బరిలోకి దిగి అన్ని స్థానాలను కైవసం చేసుకున్నాయి. శనివారం నిర్వహించిన ఓట్ల కౌంటింగ్ లో ఏబీవీపీ కూటమి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా ఏబీవీపీ విద్యార్థి సంఘం అభ్యర్థి శివ పాలెపు గెలుపొందాడు. తన సమీప ప్రత్యర్థి బిఎస్ఎఫ్ విద్యార్థి సంఘానికి చెందిన అనన్య రెండో స్థానంలో నిలిచింది. దీంతోపాటు ఏబీవీపీ కూటమి అభ్యర్థులు దేబెంద్ర - ఉపాధ్యక్షుడిగా, శృతి ప్రియా - ప్రధాన కార్యదర్శిగా, సౌరబ్ శుక్ల - జాయింట్ సెక్రటరీగా, వీనస్ - కల్చరల్ సెక్రటరీగా, జ్వాలా - స్పోర్ట్స్ సెక్రటరీగా విజయం సాధించారు. స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ కూటమి అఖండ విజయం సాధించడంతో శనివారం రాత్రి యూనివర్సిటీ ప్రధాన గేటు ముందు విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు.



అధ్యక్షుడిగా గెలుపొందిన ఏబీవీపీ అభ్యర్థి శివ పాలెపు

మొదటి పేజీ తరువాయి

# విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు సాధ్యం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

### వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం

ఈకబురు, శేరిలింగంపల్లి : జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్య ఒక్కటే మార్గమని, ప్రతి విద్యార్థి చదువుల్లో ఉత్తమంగా రాణించి భవిష్యత్తును పూలబాటగా మార్చుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఆత్మ నిర్భర్, భారత్ వికసిత్ భారత్, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు శనివారం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. దీంతోపాటు విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఆయా ప్రభుత్వ పాఠశాలలకు క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్, బాస్కెట్ బాల్, షటిల్ బ్యాట్లు, యోగ మ్యాట్స్, చెస్ బోర్డులు వంటి క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని అన్నారు. నేడు భారత్ ను అగ్రదేశాల సరసన నిలిపేందుకు నరేంద్ర మోడీ ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. అలాగే భారత భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, ప్రధాని నరేంద్ర మోదీ కలలుకంటున్న వికసిత్ భారత్ 2047 సాధనలో ప్రతి విద్యార్థి తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, మహిళా మోర్చా, యువమోర్చా, ఎస్టీ మోర్చా నాయకులు ,కార్యకర్తలు అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న గంగాధర్ రెడ్డి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్

# కారు డ్రైవర్ రాష్ డ్రైవింగ్...



నజీర్ ఫహాద్ (ఫైల్)



అబ్దుల్ ఆహాబుద్దిన్ ఖాన్ (ఫైల్)

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ఈకబురు, శేరిలింగంపల్లి : ఓ కారు డ్రైవర్ రాష్‌డ్రైవింగ్ ఇద్దరి యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. ఐటీ కారిడార్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రాయదుర్గం పోలీసుల కథనం ప్రకారం ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...
నగరంలో ని టోలీచౌకీలో నివాసం ఉండె మహ్మద్ అబ్దుల్ నజీర్ ఫహద్(22) పాన్ షాపులో పని చేస్తుంటాడు. తన స్నేహితుడు మహ్మద్ అబ్దుల్ ఆహదుద్దీన్ ఖాన్(25)తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత స్కూటీపై టోలిచౌకీ నుంచి గచ్చిబౌలి వైపు బయలుదెరారు.. అర్ధరాత్రి 1.15 గంటల సమయంలో రాయదుర్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో వెనక నుంచి అతి వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన టయోటా కరోలా అల్టీస్ కారు వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరు గాల్లో ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో నజీర్ ఫహాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన అబ్దుల్ అహదుద్దీన్ ఖాన్ ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు ధృవీకరించారు. సమాచారం అందుకున్న అందుకున్న రాయదుర్గం పోలీసులు ఇద్దరు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సాఫ్ట్వేర్ ఉద్యోగి కార్తీక్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# భారత్ దాడి చేస్తే.. సౌదీ మాకు అండగా వస్తుంది



### పాక్ రక్షణ మంత్రి ఖవాజా వెల్లడి

ఈ-కబురు, న్యూఢిల్లీ: సౌదీ అరేబియాతో చేసుకున్న రక్షణ ఒప్పందం ఫలితంగా భారత్ తమపై దాడి చేసిన పక్షంలో ఆ దేశం రంగంలోకి దిగుతుందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టం చేశారు. 'ఈ ఒప్పందం ఏ ఒక్క దేశాన్నో లక్ష్యంగా చేసుకున్నది కాదు. ఉమ్మడి రక్షణకు కుదిరిన అంగీకారం. దురాక్రమణ కోసం దీనిని వాడుకోబోం'అని ఆయన జియో టీవీకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

'మా అణు విధానం ప్రత్యేకంగా భారత్‌నుద్దేశించిందే అయినప్పటికీ సౌదీ అరేబియా అత్యవసరమైన పక్షంలో మా అణు పాటవం సహా సైనిక సామర్థ్యాలను అన్నింటినీ వాడుకునేందుకు ఈ సమగ్ర ఒప్పందంలో ఏర్పాట్లున్నాయి'అని ఆయన వివరించారు. రెండు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దురాక్రమణ జరిగినా దానిని ఉమ్మడి దురాక్రమణగా పరిగణించేందుకు ఈ ఒప్పందంలో నిబంధనలున్నాయన్నారు. ఇలా ఉండగా, పాక్ ఆర్మీతో మరో దఫా తలపడాల్సి వస్తే భారత్ ఇప్పుడు సౌదీ అరేబియాను సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని భౌగోళిక రాజకీయ విశ్లేషకుడు ఇయాన్ బ్రెమ్మర్ చెబుతున్నారు.

# విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### మన సంస్కృతిని విద్యార్థులు మరిచిపోవద్దు : స్కూల్ డైరెక్టర్ త్రిమూర్తులు పొన్నాడ

ఈ-కబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు శనివారం వైభవంగా జరుపుకున్నారు. స్కూల్ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు సాంప్రదాయ వేషధారణతో హాజరై బతుకమ్మ ఆడి, పాడారు. విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అంజయ్య నగర్, కొల్లూరు బ్రాంచ్ లలో శనివారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి స్కూలుకు తీసుకువచ్చిన విద్యార్థులు ..స్కూల్ ఆవరణలో ఉంచి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్, లయన్, డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నాడ త్రిమూర్తులు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు నిలుస్తాయని, విద్యార్థులు మన సంస్కృతిని ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సాంస్కృతిక విలువలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. నేటి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అంజయ్య నగర్ బ్రాంచ్ ఇంచార్జిలు పద్మావతి, మధు స్మిత, కొల్లూరు బ్రాంచ్ అడ్మిన్ లు సక్కుబాయి, సుబ్బారావులతో పాటు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆవరణలో విద్యార్థుల బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ పొన్నాడ త్రిమూర్తులు

# వచ్చేవారమే 'స్థానిక' నోటిఫికేషన్?



ఈ-కబురు:హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గుచూపింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి.. వెంటనే వచ్చేవారంలోనే ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ కూడా జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పలువురు మంత్రులతో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఎన్నికలు వాయిదా వేయడం కంటే ముందుకు వెళ్లడమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదివారం ఉదయం 11 గంటలకు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వచ్చే గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మెజారిటీ అభిప్రాయం మేరకే...: గ్రామ పంచాయతీలకు దాదాపు 20 నెలలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు దాదాపు 14 నెలల కిందట కాలపరిమితి ముగిసింది. ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని భావించి ఇంతకాలం ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. ఓబీసీలకు రిజర్వేషన్ల కల్పనకు అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి గవర్నర్‌కు పంపగా, దానిని ఆయన రాష్ట్రపతి అనుమతి కోసం పంపించారు.

ఇప్పుడు ఆ బిల్లు రాష్ట్రపతి వద్దనే పెండింగ్‌లో ఉంది. దీంతో మరో ప్రయత్నంగా పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా పరిమితి విధించిన నిబంధనను తొలగిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ బిల్లు కూడా ప్రస్తుతం గవర్నర్ దగ్గర పెండింగ్‌లోనే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను ఆపే అధికారంపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు తేలిన తరవాతే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు.

# యువత ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవాలి




పదేళ్లలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

'గడిచిన పదేళ్లలో అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతోపాటు అమెజాన్ అతిపెద్ద క్యాంపస్, అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ హబ్ వంటివి తెలంగాణలో సాధ్యమయ్యాయి. ఇదే రీతిలో మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయింది. మనదేశంలోని 38 కోట్ల జెన్–జీ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచ గతిని మార్చేందుకు ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలి. ప్రస్తుతం తెలంగాణలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుతో ప్రజలు పోల్చి (రీకాల్) చూసుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించుకోనందుకు (రిగ్రెట్) బాధపడుతున్నారు. త్వరలోనే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే (రివోల్ట్)కు అవకాశం ఉంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

రహదారి భద్రతా సెస్ పేరుతో ప్రజలపై భారం వేస్తారా?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రహదారి భద్రతా సెస్ పేరుతో ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రూ.2వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం వేయాలని చూడటం పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని దగా చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే.. వాటిని అమలు చేయాల్సింది పోయి వాహన కొనుగోలుదారులపై భారం మోపడం ఏమిటని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పైసా పైసా కూడబెట్టుకుని, లేదా అప్పు చేసి వాహనాలు కొనుగోలు చేసే పేద, మధ్యతరగతివారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలని, రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# 700కి పైగా ఉత్పత్తుల ధరలను తగ్గించిన అమూల్..!




**నెయ్యి, జున్ను, వెన్న నుండి ఐస్ క్రీం వరకు..!!**

1. దేశంలోనే అతి పెద్ద పాల సంస్థ అయిన అమూల్ తన 700కి పైగా ఉత్పత్తులపై ధరల తగ్గింపును ప్రకటించింది
2. ఇటీవల తగ్గించిన GST రేటు ప్రయోజనాలను నేరుగా వినియోగదారులకు అందించడానికి అమూల్ ఈ చర్య తీసుకుంది.

కొత్త ధరలు సెప్టెంబర్ 22, 2025 నుండి అమలులోకి వస్తాయి. ఇందులో నెయ్యి, వెన్న, చీజ్, ఐస్ క్రీం మరియు ఇతర పాల ఉత్పత్తులు ఉన్నాయి. ఈ మార్పు సెప్టెంబర్ 22, 2025 నుండి అమలులోకి వస్తుంది. కొత్త GST స్లాబ్‌లలో మార్పుల తర్వాత అమూల్ ఈ చర్య తీసుకుంది.

నెయ్యి: ఒక లీటరు అమూల్ నెయ్యి ధర 40 రూపాయలు తగ్గి 610 రూపాయలకు చేరుకుంది.

వెన్న: 100 గ్రాముల వెన్న ప్యాక్ ఇప్పుడు 62 రూపాయలకు బదులుగా 58 రూపాయలకు లభిస్తుంది.

చీజ్: ఒక కిలోగ్రాము చీజ్ బ్లాక్ ధర 30 రూపాయలు తగ్గి 545 రూపాయలకు చేరుకుంది.

పనీర్: 200 గ్రాముల ఫ్రోజెన్ పనీర్ ప్యాక్ 99 రూపాయల నుండి 95 రూపాయలకు తగ్గనుంది.

ఇతర ఉత్పత్తులు: UHT పాలు, చాక్లెట్లు, బేకరీ ఉత్పత్తులు, ఫ్రోజెన్ స్నాక్స్, కండెన్స్డ్ మిల్క్, వేరుశెనగ స్ప్రెడ్ మరియు మాల్ట్ పానీయాల ధరలు కూడా తగ్గించబడ్డాయి..

# ప్రీమియం హోటల్స్ కోసం ఇక ఓయో 'చెకిన్'




ప్రీమియం హోటళ్లు, హోమ్‌స్టే బ్రాండ్లను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఓయో మాతృ సంస్థ ప్రిజం ప్రత్యేకంగా 'చెకిన్' పేరిట కొత్త విభాగాన్ని ప్రారంభించింది. ఇందులో ప్రీమియం హోటళ్లు, సండే హోటల్స్, క్లబ్‌హౌస్, పాలెట్, చెక్‌మైగెస్ట్, డ్యాన్సెంటర్, బెల్‌విల్లా తదితర బ్రాండ్స్ ఉంటాయి.

ఓయో ఏ విధంగానైతే బడ్జెట్ ట్రావెల్‌కి పర్యాయపదంగా మారిందో చెకిన్ కూడా అదే విధంగా ప్రీమియం హోటళ్లు, హోమ్‌స్‌కి గ్లోబల్ బ్రాండ్‌గా ఉంటుందని ప్రిజం వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ తెలిపారు. ప్రాథమికంగా చెకిన్ భారత్‌లో అందుబాటులో ఉంటుందని, దశలవారీగా రాబోయే నెలల్లో అంతర్జాతీయంగా కూడా ప్రవేశపెడతామని పేర్కొన్నారు. తమ అధ్యయనం ప్రకారం 55 శాతం మంది మరింత నాణ్యమైన, లగ్జరీ అనుభూతిని అందించే హోటళ్లకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడైందని ప్రిజం తెలిపింది.

# ఫ్లిప్‌కార్ట్ సరికొత్త ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్




దేశీయ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, లార్జ్ అప్లయన్సెస్‌తో సహా 26 ఉత్పత్తి విభాగాలలో ఒక వినూత్న ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. వినియోగదారులకు తక్షణ విలువ, మెరుగైన అప్‌గ్రేడ్లను అందించడానికి దీన్ని రూపొందించారు. ఇందుకోసం సరికొత్త ఏఐఆధారిత 10దశల డయాగ్నొస్టిక్ టూల్ ఏర్పాటు చేస్తోంది. ఇది రియల్ టైమ్ , పారదర్శక ఉత్పత్తి విలువలను నిమిషాల్లో అందిస్తుంది.

ప్రోగ్రామ్ ముఖ్యాంశాలు

క్రాస్‌కేటగిరీ ఎక్స్ఛేంజ్: కస్టమర్లు పాత ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్‌లు వంటి వస్తువులను విస్తృత శ్రేణి కొత్త ఉత్పత్తుల కోసం ఎక్స్ఛేంజ్ చేయవచ్చు.

రియల్ టైమ్ ఏఐ డయాగ్నస్టిక్స్: పాత ఉత్పత్తుల వేగవంతమైన, ఖచ్చితమైన, పారదర్శక విలువను నిర్ధారిస్తుంది.


స్థిరమైన వాణిజ్యం: పనికిరాని గృహ ఎలక్ట్రానిక్స్, ఉపకరణాల పునర్వినియోగం, రీసైక్లింగ్ ను ప్రోత్సహిస్తుంది. వాటిని "ఇంట్లో కరెన్సీ"గా మారుస్తుంది.

టైర్ 2 & 3 సిటీ ఫోకస్: ప్రీమియం ఉత్పత్తులకు అందుబాటును పెంచడం, చిన్న పట్టణాల్లోనూ ప్రీమియం ఉత్పత్తులు కొనే వెసులుబాటు కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

పండుగ సీజన్ బూస్ట్: రాబోయే షాపింగ్ సీజన్లో కస్టమర్ విలువను పెంచడానికి సమయం.

స్థిరమైన వినియోగాన్ని పెంచే తెలివైన, సాంకేతికతతో కూడిన రీకామర్స్ వ్యవస్థను నిర్మించడానికి ఫ్లిప్‌కార్ట్ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని ఆ సంస్థ సీనియర్ డైరెక్టర్ & రీకామర్స్ బిజినెస్ హెడ్ అశుతోష్ సింగ్ చందేల్ పేర్కొన్నారు.

# 23 నుంచి ట్రూ కలర్స్ ఐపీఓ




దిల్లీ: డిజిటల్ టెక్స్‌టైల్స్ ప్రింటర్స్ దిగుమతిదారు, పంపిణీదారు అయిన ట్రూ కలర్స్ కంపెనీ రూ.127.96 కోట్ల ఐపీఓకు రాబోతోంది. ఈ నెల 2325 తేదీల్లో ఇష్యూ ఉండనుంది. ధరల శ్రేణి రూ.181191. ఈ నెల 22న యాంకర్ మదుపర్లు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. ఐపీఓలో సుమారు 57 లక్షల తాజా ఈక్విటీ షేర్లను కంపెనీ విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో 10 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. తాజా షేర్ల ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.48.90 కోట్ల నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ.40.40 కోట్లను రుణాల చెల్లింపునకు, మిగతా మొత్తాన్ని ఇతర సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని కంపెనీ వెల్లడించింది. 2021 అక్టోబరులో ట్రూ కలర్స్‌ను స్థాపించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.233.65 కోట్ల ఆదాయాన్ని, రూ.24.69 కోట్ల లాభాన్ని ఆర్జించింది. పబ్లిక్ ఇష్యూ తర్వాత కంపెనీ షేర్లను బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదు చేయనున్నారు. జీవైఆర్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా, బిగ్‌షేర్ సర్వీసెస్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నాయి.

# కార్పొరేట్ డెట్ సెక్యూరిటీలకు మహర్దశ




## ట్రేడింగ్ కార్యకలాపాల బలోపేతానికి సెబీ, ఆర్‌బీఐ చర్చలు

ముంబయి: కార్పొరేట్ డెట్ సెక్యూరిటీల్లో ట్రేడింగ్ కార్యకలాపాలను బలోపేతం చేయడం కోసం కార్పొరేట్ బాండ్ ఇండెక్స్ డెరివేటివ్స్‌పై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, ఆర్‌బీఐ చర్చలు జరుపుతున్నాయని సెబి శాశ్వత కాల సభ్యుడు అనంత్ నారాయణ్ జి తెలిపారు. అసోచామ్ నేషనల్ కౌన్సిల్ ఫర్ కార్పొరేట్ బాండ్స్ కార్యక్రమంలో నారాయణ్ మాట్లాడుతూ 'ఈ విషయంపై మొదలైన ఆర్‌బీఐ, సెబి చర్చల్లో మంచి ప్రగతి కనిపిస్తోంది. సెకండరీ బాండ్ మార్కెట్‌లో నెలకు రూ.1.4 లక్షల కోట్ల మేర ట్రేడింగ్ పరిమాణం ఉంటోంది. ఈక్విటీ మార్కెట్స్ ట్రేడింగ్ రోజుకే ఈ స్థాయిలో ఉంటుంది. ఒక వేళ బాండ్ల ట్రేడింగ్‌లో కూడా ఈక్విటీ ట్రేడింగ్ తరహాలోనే సెటిల్‌మెంట్ పద్ధతులు, ప్లాట్‌ఫామ్స్ తీసుకొస్తే.. ఇంకా వృద్ధి కనిపించగలదని అన్నారు. కార్పొరేట్ డెట్ సెక్యూరిటీస్ సూచీల్లో డెరివేటివ్ కాంట్రాక్టులను తీసుకురావడానికి స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెబీ అనుమతి ఇచ్చింది. అయితే అంత ఆదరణ లభించలేదు. వీటిపై ఆసక్తి పెంచే దిశగా ఆర్‌బీఐ, సెబి చర్చలు జరుపుతున్నాయి.



# లాల్.. సలామ్

**'మోహన్‌లాల్ అమెరికాలోనో లేదంటే ఐరోపా దేశాల్లోనో జన్మించి ఉంటే ఇప్పటికే ఎన్ని ఆస్కార్‌లు గెలిచేవారో...' - 'వానప్రస్థం' సినిమాలో లాల్ నట విశ్వరూపం చూసిన ఓ విదేశీ నటుడు అన్న మాట ఇది. ఇలాంటి ప్రశంసలు విన్నప్పుడు 'నాకు ఈ దేశంలో పుట్టడం, ఇక్కడ నటుడిగా రాణించడం మాత్రమే ఇష్టం, మిగిలినవన్నీ నాకు అనవసరం' అంటుంటారు మోహన్‌లాల్. ఒక్క 'వానప్రస్థం' సినిమానే కాదు, మోహన్‌లాల్ పోషించిన ఎన్నో పాత్రలు ఆయన ఆస్కార్ స్థాయి నటుడు అని చాటుతాయి. తూకం వేసినట్టుగా పాత్రల్లో ఒదిగిపోతారు మరీ! తెరపై కనిపించేది మన అభిమాన నటుడనే విషయాన్నే మరిపించేస్తారు. చూస్తున్నంతసేపూ కథా ప్రపంచంలో లీనమయ్యేలా, పాత్రతో కలిసి ప్రయాణం చేసేలా చేస్తారు. అందుకే మోహన్‌లాల్ పరిపూర్ణ నటుడు అనిపించుకున్నారు. ఆయన ప్రతిభకి ఇప్పటికే ఎన్నో పురస్కారాలు సలామ్ కొట్టాయి. ఇప్పుడు భారతీయ అత్యున్నత సినీ పురస్కారానికి ఎంపికై దాదా మోహన్‌లాల్ అనిపించుకున్నారు.**

మోహన్‌లాల్‌ని తన అభిమానులు ప్రేమతో లాలెట్టాన్ అని పిలుచుకుంటూ ఉంటారు. మలయాళంలో పెద్దన్న అనే అర్థంతో కూడిన మాట అది. అభిమానులకే కాదు, భారతీయ సినీ రంగంలో నేటి తరానికీ ఆయన ఓ పెద్దన్నతో సమానమే! ఆయన నట ప్రస్థానం కొత్త తరానికో పాఠ్యగ్రంథం. 48 ఏళ్లుగా సాగుతున్న సుదీర్ఘమైన సినీ ప్రయాణం ఆయనది. ఆరు పదుల వయసులోనూ ఎంత సవాల్‌తో కూడిన వైవిధ్యమైన పాత్రలు చేయడానికైనా వెనకాడని లాల్.. 'ఇన్నేళ్ల ప్రయాణంలో నేను సినిమాని ప్రేమించినంతగా దేన్నీ ప్రేమించలేదు' అంటారు. 400 సినిమాలకి చేరువగా ఉన్న కథానాయకుడాయన. తెరపై ఒక పాత్రకి పరిమితం చేయలేం. విలన్ ఆయనే, క్యారెక్టర్ నటుడు ఆయనే, కథానాయకుడూ ఆయనే. నవ్వించేది ఆయనే, ఏడిపించేదీ ఆయనే. మలయాళంలో ప్రయాణం మొదలైనా... తమిళ, తెలుగు, కన్నడ, హిందీ... ఇలా ఏ భాషలో చూసినా ఆయన విజృంభణే. తెర వెనక కూడా పాట పాడటం మొదలుకొని... నిర్మాణం, దర్శకత్వం వరకూ ఎన్నెన్ని పాత్రలో. ఏం చేసినా పరిపూర్ణంగా చేయడమే మోహన్‌లాల్ విజయ రహస్యం అంటాయి సినీ పరిశ్రమ వర్గాలు.

**గాయకుడిగానూ మురిపించి..**

సంగీతం అంటే మోహన్‌లాల్‌కి అమితమైన ప్రేమ. తన 'కందు కందరింజు' అనే చిత్రంతో 1985లో గాయకుడి అవతారమెత్తిన మోహన్‌లాల్ ఆ తర్వాత ఎన్నో పాటలు పాడారు. ఆయనకి ఒక మ్యూజిక్ బ్యాండ్ కూడా ఉంది. సంగీత ప్రధానంగా సాగే పలు టెలివిజన్ షోల్ని కూడా నిర్వహించారాయన. పదుల సంఖ్యలో చిత్రాల్ని నిర్మించారు. చిన్నప్పట్నుంచీ సైన్యం అంటే ఆయనకి ఎనలేని గౌరవం. సైనికుల జీవితాన్ని తెరపై చూపించాలనే ఉద్దేశంతో ఆయన 'కీర్తిచక్ర', 'కురుక్షేత్ర' తదితర చిత్రాలు చేశారు. భారతసైన్యం ఆయనకి లెఫ్టినెంట్ కల్నల్ హోదాని ప్రదానం చేసింది. ఆ హోదాలోనే ఆయన ఆమధ్య ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన వయనాడ్‌కు వెళ్లి సైనికులతో కలిసి సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు.

**రూ.వందల కోట్ల వసూళ్లతో...**

ఒకొక్క ఏడాదిలో పదుల సంఖ్యలో సినిమాలు చేసిన మోహన్‌లాల్ మలయాళ బాక్సాఫీస్‌ని కళకళలాడించారు. 1986లో ఏకంగా 36 సినిమాలు చేసిన ఆయన జోరు అలాగే కొనసాగింది. 'పులి మురుగన్'తో రూ.వంద కోట్ల వసూళ్ల మార్క్‌ని అందుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి మలయాళ చిత్రం ఇదే. ఆ తర్వాత వచ్చిన 'లూసిఫర్' రూ.200 కోట్లకుపైగా వసూళ్లని సాధించింది. 'ఎల్ 2 ఈ' ఏకంగా రూ. 265 కోట్లు వసూలు చేసింది. మల్టీస్టారర్ సినిమాల్లో విరివిగా నటించే ఆయన, యువతరంతో పోటీపడి సినిమాలు చేస్తున్నారు.

**ఆరో తరగతిలోనే 90 ఏళ్ల వ్యక్తిగా**

కేరళలోని పథనంతిట్ట జిల్లాలోని ఎలంథూర్ అనే గ్రామంలో 1960 మే 21న జన్మించారు మోహన్‌లాల్. ఆయన పూర్తిపేరు మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్. తండ్రి విశ్వనాథన్ నాయర్ కేరళ ప్రభుత్వంలా సెక్రటరీగా పనిచేశారు. తల్లి శాంతకుమారి గృహిణి. తిరువనంతపురంలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆరో తరగతిలోనే నాటకాలతో అనుబంధం పెరిగింది. తొలి నాటకంలోనే 90 ఏళ్ల వ్యక్తి పాత్రలో నటించారు. అప్పట్నుంచే ఆయనకు నటనలో ప్రయోగాలు అలవాటయ్యాయి. 'తిరణోట్టమ్' అనే సినిమాతో తొలిసారి కెమెరా ముందుకొచ్చినా... ఆయనకి 1980లో విడుదలైన 'మంజిల్ విరింజపూక్కళ్' అనే చిత్రంతోనే గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఆ తరహా పాత్రలు ఆయన్ని వరుసగా వరించాయి. 'ఇవిడే తుండగుణ్ణు' సినిమాతో పూర్తిస్థాయి హీరోగా మెప్పించారు. 'రాజావింటే మకన్' అనే సినిమాతో ఆయన స్టార్‌గా అవతరించారు. 'నాడోడికట్టు', 'మళ పెయ్యున్ను మద్దలమ్ కొట్టున్ను', 'సీజన్', 'దేవాసురమ్', 'వరవేల్పు', 'తలవట్టమ్', 'పట్టణప్రవేశమ్', 'మిథునం', 'పవిత్రమ్', 'కలియిల్ అల్పమ్ కార్యమ్', 'ఇరువర్', 'భరతన్', 'కాలాపానీ', 'వానప్రస్థం', 'మణిచత్రతాళు', 'గురు', 'నరసింహం', 'ఒడియన్', 'రావణప్రభు', 'ఒప్పం (కనుపాప)' ఇలా గుర్తుండిపోయే చిత్రాలు చేశారు. 'యోధ', 'అభిమన్యు', 'కాలాపానీ', 'ఇద్దరు' సహా ఈమధ్య వచ్చిన 'మన్యం పులి', 'పులిజూదం', 'మరక్కార్', 'లూసిఫర్', 'ఎల్ 2 ఈ', 'తుడరుమ్' వరకూ అనువాదాలుగా వచ్చిన లాల్ సినిమాలు తెలుగు ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించాయి. తొలిసారి 'గాండీవం' సినిమాతో తెలుగు తెరపై తళుక్కున మెరిశారు. 'గోరువంక వాలగానే...' అంటూ సాగే పాటలో లాల్ మెరిశారు. ఆ తర్వాత 'జనతాగ్యారేజ్', 'మనమంతా', 'కన్నప్ప' తదితర చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింతగా చేరువయ్యారు. ఆయన ఈ సినిమాల కోసం తెలుగు భాషపై పట్టు పెంచుకుని మరీ సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం విశేషం.

## అఖండ గీతం... 600 మంది డ్యాన్సర్లతో!



మాస్ అనే మాటకి నిలువెత్తు నిర్వచనం... నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయిక. పాటలోనూ మాస్, మాటలోనూ మాస్. పోరాటంలోనూ మాసే, హీరోయిజంలోనూ మాసే. అందుకే ఈ ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నారంటే చాలు... నందమూరి అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ప్రేక్షకులు అసలు సిసలు మాస్ సినిమా చూసేందుకు సిద్ధమైపోతుంటారు. ప్రతిసారీ ఆ అంచనాలకు దీటుగా సినిమాల్ని తెరకెక్కిస్తుంటారు బోయపాటి శ్రీను. విజయవంతమైన ఈ కలయికలో ప్రస్తుతం నాలుగో చిత్రం రూపొందుతోంది. అదే... 'అఖండ 2: తాండవం'. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి ముఖ్యభూమిక పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పకులు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో 600 మంది డ్యాన్సర్ల నేపథ్యంలో బాలకృష్ణపై ఓ మాస్ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. భాను నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. "బాలకృష్ణ మాస్ మూమెంట్స్‌తోనూ... తమన్ బాణీతోనూ అదిరిపోయేలా ఉంటుంది ఈ పాట. థియేటర్లలో అభిమానుల్ని, ప్రేక్షకుల్నీ ఉర్రూతలూగించడం ఖాయం. భారీ హంగుల మధ్య చిత్రీకరణ సాగుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ టీజర్ గొప్ప స్పందనని సొంతం చేసుకుంది. బాలకృష్ణ ఇదివరకెప్పుడూ కనిపించని రీతిలో, ఉగ్రమైన అవతారంలో ఇందులో కనిపిస్తార"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు, పోరాటాలు: రామ్‌లక్ష్మణ్.

## షారుక్ పాఠాల్నే అమలు చేస్తున్నా!



బాలీవుడ్‌లో హిట్ కాంబినేషన్ అంటే సినీప్రియుల మదిలో మెదిలే జోడీ షారుక్ ఖాన్, దీపికా పదుకొణెలదే. 'ఓం శాంతి ఓం', 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'హ్యాపీ న్యూఇయర్', 'పఠాన్', 'జవాన్' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది జంట. ఇప్పుడు మరోసారి తెరపై అదరగొట్టడానికి ముస్తాబవుతోంది. షారుక్ ప్రధాన పాత్రలో 'కింగ్' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. దీపికా పదుకొణె కథానాయిక. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర సెట్లోకి అడుగుపెట్టినట్టు ఇన్‌స్టా వేదికగా తెలుపుతూ.. ఓ పోస్ట్ పెట్టింది దీపిక. "దాదాపు 18 ఏళ్ల క్రితం 'ఓం శాంతి ఓం' సినిమా చేస్తున్నప్పుడు నాకు షారుక్ కొన్ని పాఠాలు నేర్పారు. సినిమాతో మనం ఏం నేర్చుకున్నాం.. అందులో ఎవరితో చేస్తున్నామనే విషయాలే.. సినిమా విజయం కంటే ముఖ్యమైన అంశాలని చెప్పారు. నేను ఆ మాటలనే పూర్తిగా నమ్ముతాను. అప్పటి నుంచి నేను తీసుకునే ప్రతి నిర్ణయం వెనక ఆ పాఠాన్నే అమలు చేస్తున్నా. అందుకే షారుక్‌తో మళ్లీ కలిసి ఆరో సినిమా చేస్తున్నా" అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో సుహానా ఖాన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

## శివ రీరిలీజ్ ఖరారు



భారతీయ సినిమాని 'శివ'కి ముందు, తర్వాత అంటూ పునర్నిర్వచిస్తుంటారు విశ్లేషకులు. అంతగా ప్రభావం చూపించిన ఆ సినిమా 1989లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. నాగార్జున కథానాయకుడిగా నటించగా... రామ్‌గోపాల్ వర్మ దర్శకుడిగా పరిచయం అయ్యారు. అమల కథానాయిక. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం 4కే విజువల్స్, డాల్బీ అట్మాస్ సౌండ్ తదితర అత్యాధునిక హంగులతో సరికొత్తగా ముస్తాబై మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. నట దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా 'శివ' రీరిలీజ్ డేట్‌ని శనివారం ప్రకటించింది అన్నపూర్ణ స్టూడియోస్ వర్గాలు. నవంబరు 14న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపాయి. అప్పట్లోనే అత్యాధునిక సౌండ్ డిజైన్‌తో విడుదలైన ఈ చిత్రం, ఈసారి మరిన్ని సాంకేతిక హంగులతో ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్ని పంచుతుందని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెలిపారు.

## ఆ ఇడ్లీ కొట్టంటే మా ఊరోళ్లకి సెంటిమెంట్



ధనుష్, నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సందర్భంగా శనివారం చిత్రబృందం అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ "మిషన్లతో అన్నీ చేసేయొచ్చు అంటారు కానీ రుచి అనేది మాత్రం.. మనసు పెడితేనే వస్తుంది. జీవితంలో మనం చేసే పనిని ఆదాయం కోసం మాత్రమే కాదు. ఆస్వాదిస్తూ కూడా చేయాలి. ఆ ఇడ్లీ కొట్టంటే మా ఊరోళ్లకి సెంటిమెంట్ సార్. దమ్మిడికి పనికిరాని వాళ్ల నాన్న ఇడ్లీ కొట్టు కోసం వాడు చావడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు" లాంటి సంభాషణలతో ఆకట్టుకుంటోంది. ఇందులో ధనుష్ తన వ్యక్తిత్వం కోసం ఉద్యోగాన్ని వదిలి..తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాడు.

## పాక్ జట్టు కోసం మానసిక నిపుణుడు



దుబాయ్: ఆసియా కప్‌లో భారత్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన పాక్.. సూపర్-4 మ్యాచ్ ముంగిట తమ ఆటగాళ్లలో ప్రశాంతత నింపేందుకు మానసిక వికాస నిపుణుడిని ఆశ్రయించింది. రహీల్ అహ్మాద్ అనే నిపుణుడు మ్యాచ్ ముందు రోజు పాక్ ఆటగాళ్లను కలిశాడు. తీవ్ర ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో ప్రశాంతంగా ఆడే దిశగా అహ్మాద్ వారిలో ప్రేరణ నింపే ప్రయత్నం చేశాడట. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ సైతం ప్రాక్టీస్‌లో ఉన్న ఆటగాళ్లను కలిసి వారిలో విశ్వాసం పెంచే ప్రయత్నం చేశాడు.

## దిల్లీకి పట్నా కళ్లెం



జైపుర్: ప్రొ కబడ్డీ సీజన్-12లో పట్నా పైరేట్స్ అదరగొట్టింది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దబంగ్ దిల్లీ జోరుకు కళ్లెం వేసింది. శనివారం ఆ జట్టు 33-30తో దిల్లీని ఓడించింది. ఆట మొదట్లో దిల్లీ దూకుడుగా ఆడింది. ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 19-10తో బ్రేక్‌కు వెళ్లింది. రెండో అర్ధంలో పట్నా జోరందుకుంది. వరుస పాయింట్లతో ప్రత్యర్థికి సమీపంగా వచ్చింది. మరో పది నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా దిల్లీ 4 పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. ఆ జట్టు జోరు చూస్తే విజయం ఖాయమని అనిపించింది. కానీ చివర్లో విజృంభించిన పట్నా.. స్వల్ప తేడాతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. అంకిత్ కుమార్ (12) పట్నా గెలుపులో కీలకమయ్యాడు. వరుసగా నాలుగు విజయాల తర్వాత దిల్లీకి ఇదే తొలి ఓటమి. రెండు ఓటముల అనంతరం పట్నా తిరిగి గెలుపుబాట పట్టింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 38-36తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. శివమ్ (9), వినయ్ (7) హరియాణా తరపున రాణించారు.

# 413 పరుగుల ఛేదనలో అద్భుత పోరాటం



**50 బంతుల్లో సెంచరీ కొట్టిన ఓపెనర్**
**ఆఖరి వన్డేలో భారత మహిళల ఓటమి**
**ఆస్ట్రేలియాదే సిరీస్**

**దిల్లీ**

413. ఆసీస్ నిర్దేశించిన లక్ష్యమిది. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాంటి పిచ్‌పై అయినా వన్డే క్రికెట్లో అంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించడం దాదాపు అసాధ్యమే. కంగారూల గెలుపు లాంఛనమే అనుకున్నారంతా! ఆఖరికి ఆ జట్టే గెలిచింది. కానీ భారత్ అసాధారణ పోరాటపటిమతో ఆ జట్టుకు చెమటలు పట్టించింది. పట్టుదలతో ఆకట్టుకుంది. స్మృతి మంధాన విధ్వంసక బ్యాటింగ్‌తో వన్డేల్లో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేయడంతో భారత్ గెలుపు రేసులో నిలిచింది. రసవత్తర పోరులో ఆసీస్‌ను ఓడించినంత పని చేసింది.స్మృతి మంధాన (125; 63 బంతుల్లో 17×4, 5×6) అద్భుత శతకం సాధించినా.. చివరిదైన మూడో వన్డేలో భారత్ 43 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. బెత్ మూనీ (138; 75 బంతుల్లో 23×4, 1×6) మెరుపు శతకంతో మొదట ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించింది. 47.5 ఓవర్లలో 412 పరుగులకు ఆలౌటైంది. జార్జియా వోల్ (81; 68 బంతుల్లో 14×4), పెర్రీ (68) రాణించారు. ప్రపంచ రికార్డు లక్ష్య ఛేదనలో భారత్ 47 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటైంది. స్మృతితో పాటు దీప్తి శర్మ (72; 58 బంతుల్లో 5×4, 2×6), హర్మన్‌ప్రీత్ కౌర్ (52; 35 బంతుల్లో 8×4) రాణించారు. ఈ విజయంతో సిరీస్‌ను ఆస్ట్రేలియా 21తో గెలుచుకుంది.

మంధాన ధనాధన్: అంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించడం దాదాపు అసాధ్యమే. ఏ జట్టుకైనా నిరుత్సాహం వస్తుంది. కానీ ఆకాశమే హద్దుగా చెలరేగిన ఓపెనర్ స్మృతి మంధాన విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్‌ను రేసులో నిలిపింది. ప్రతీక రావల్ (10) త్వరగానే నిష్క్రమించినప్పటికీ స్మృతి.. ఆసీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కళ్లు చెదిరే షాట్లతో అలరించిన ఆమె.. ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును ఉరకలు పెట్టించింది. కిమ్ గార్త్ వేసిన ఓ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదింది. స్మృతి 23 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసింది. 9వ ఓవర్లో హర్లీన్ డియోల్ (11) ఔటైనా.. హర్మన్‌ప్రీత్ రూపంలో చక్కని భాగస్వామి దొరకడంతో స్మృతి స్వేచ్ఛగా చెలరేగిపోయింది. ఎడాపెడా ఫోర్లు, వీలైనప్పుడు సిక్స్‌లతో కంగారూల బౌలింగ్‌ను తుత్తునియలు చేసింది. ఈ క్రమంలో భారత్ తరపున అత్యంత వేగవంతమైన శతకాన్ని (50 బంతుల్లో) నమోదు చేసింది. అలానా కింగ్ బౌలింగ్‌లో సిక్స్‌తో స్మృతి మూడంకెల స్కోరును అందుకుంది. 20వ ఓవర్లోనే భారత్ స్కోరు 200 దాటడం, స్మృతి, హర్మన్‌ప్రీత్ జోరు మీదుండడంతో విజయంపై ఆశలు రేగాయి. కానీ 10 పరుగుల తేడాలో వీళ్లిద్దరు నిష్క్రమించడం, రిచా ఘోష్ (6), రాధా యాదవ్ (18) త్వరగా ఔట్ కావడంతో ఆ ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగలినట్లయింది. భారత్‌ను 261/6కు పరిమితం చేసిన ఆసీస్.. పట్టుబిగించింది. కాసేపటి తర్వాత అరుంధతి రెడ్డి (10) కూడా వెనుదిరిగింది. భారత్‌కు దారి మూసుకుపోయినట్లే అనిపించింది. కానీ అద్భుతంగా బ్యాటింగ్ చేసిన దీప్తి శర్మ.. మళ్లీ ఆశలు కలిగించింది. స్నేహ్ రాణా (35) సహకారంతో ఇన్నింగ్స్‌ను నడిపించిన ఆమె.. సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో ఉంచింది. ఆసీస్ బౌలర్లపై ఒత్తిడి పెంచింది. 42 ఓవర్లకు స్కోరు 352/7. మ్యాచ్ చాలా ఆసక్తికరంగా మారింది. కానీ తాలియా బౌలింగ్‌లో దీప్తి ఔట్ కావడంతో భారత్ ఆశలకు తెరపడింది. మిగతా 2 వికెట్లు తీయడానికి ఆసీస్‌కు కష్టం కాలేదు.

కంగారూల విధ్వంసం: అంతకుముందు ఆస్ట్రేలియా పెను విధ్వంసం సృష్టించింది. బెత్ మూనీ ఆటే ఇన్నింగ్స్‌లో హైలైట్. ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. నిర్జీవ పిచ్‌పై ఓపెనర్ జార్జియా వోల్ చెలరేగిపోయింది. అలీసా (30)తో తొలి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఆమె.. పెర్రీతో రెండో వికెట్‌కు 107 పరుగులు జోడించి ఆసీస్ భారీ స్కోరుకు బాటలు వేసింది. 22వ ఓవర్లో ఆమె నిష్క్రమించేటప్పటికి స్కోరు 150. కానీ భారత బౌలర్లకు ఏమాత్రం ఉపశమనం లభించలేదు. రెచ్చిపోయి ఆడిన మూనీ ఎడాపెడా బౌండరీలతో పరుగుల వరద పారించింది. స్పిన్నర్లు, పేసర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ ఆమె.. పెర్రీతో మూడో వికెట్‌కు 106, గార్డ్‌నర్ (39)తో నాలుగో వికెట్‌కు 82, తాలియా (14)తో అయిదో వికెట్‌కు 40 పరుగులు జోడించింది. 31 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన మూనీ.. 57 బంతుల్లోనే శతకాన్ని అందుకుంది. మూనీ చివరికి 45వ ఓవర్లో ఆరో వికెట్‌గా వెనుదిరిగింది. ఆఖర్లో భారత బౌలర్లు కాస్త మెరుగ్గా బౌలింగ్ చేశారు. మరో 13 బంతులు ఉండగానే కంగారూల జట్టు ఆలౌటైంది. ఆసీస్ 34 పరుగుల వ్యవధిలో ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా: 47.5 ఓవర్లలో 412 (మూనీ 138, జార్జియా వోల్ 81, ఎలిస్ పెర్రీ 68, గార్డ్‌నర్ 39, అలీసా హీలీ 30; అరుంధతి రెడ్డి 3/86, దీప్తి శర్మ 2/75, రేణుక 2/79)

భారత్: 47 ఓవర్లలో 369 (స్మృతి మంధాన 125, దీప్తి శర్మ 72, హర్మన్‌ప్రీత్ 52, స్నేహ్ రాణా 35; కిమ్ గార్త్ 3/69, మెగాన్ షట్ 2/53)

వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ (పురుషులు, మహిళలు కలిపి) కొట్టిన భారత బ్యాటర్‌గా స్మృతి ఘనత సాధించింది. కోహ్లి రికార్డు (ఆసీస్‌పై 52 బంతుల్లో)ను ఆమె బద్దలు కొట్టింది.

**మహిళల వన్డేల్లో ఫాస్టెస్ట్ శతకాలు**

**మెగ్ లానింగ్ : 45 బంతుల్లో (2012, న్యూజిలాండ్‌పై)**

**స్మృతి మంధాన : 50 బంతుల్లో (2025, ఆస్ట్రేలియాపై)**

**కీరన్ రోల్టన్ : 57 బంతుల్లో (2000, దక్షిణాఫ్రికాపై)**

**బెత్ మూనీ : 57 బంతుల్లో (2025, భారత్‌పై)**

**సోఫీ డివైన్ : 59 బంతుల్లో (2018, ఐర్లాండ్‌పై)**

**11**

**వన్డేల్లో భారత్‌పై ఆస్ట్రేలియా గెలిచిన ద్వైపాక్షిక సిరీస్‌లు. భారత్‌పై ఆ జట్టు ఇంకా ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు.**

**13**

**మహిళల వన్డేల్లో స్మృతి మంధాన శతకాల సంఖ్య. ఈ ఫార్మాట్లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్ల జాబితాలో సుజీ బేట్స్‌తో కలిసి రెండో స్థానంలో ఉంది. లానింగ్ (15)ది మొదటి స్థానం.**

**781**

**భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో వన్డేలో రెండు జట్లు కలిసి చేసిన స్కోరు. మహిళల వన్డే మ్యాచ్‌లో నమోదైన అత్యధిక పరుగులివే.**

## ప్రపంచ అథ్లెటిక్స్‌లో సున్నా



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఈసారి భారత అథ్లెట్లు తీవ్రంగా నిరాశపరిచారు. చివరి రోజు, శనివారం పురుషుల 20 కిలోమీటర్ల నడకలో సెర్విన్ సెబాస్టియన్ 31వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. అతడు గంట 23 నిమిషాల 3 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేశాడు. మొత్తంగా గత రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో పోలిస్తే భారత్‌ది తిరోగమనమే. 2022 యూజీన్, 2023 బుడాపెస్ట్ ఛాంపియన్‌షిప్‌లలో జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మెరుపులతో భారత్ పతకాల పట్టికలో చోటు దక్కించుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశానికి మూడు పతకాలు దక్కితే అందులో చోప్రానే రెండు నెగ్గాడు. యూజీన్‌లో రజతం సాధించిన నీరజ్.. అంజు బాబి జార్జ్ (2003, లాంగ్‌జంప్, కాంస్యం) తర్వాత దేశానికి పతకాన్ని అందించిన ఘనతను సొంతం చేసుకున్నాడు. తర్వాత బుడాపెస్ట్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించాడు.

ఈసారి ఎన్నో ఆశలతో బరిలో దిగిన నీరజ్.. ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు.. అతను విఫలమైనా.. సచిన్ యాదవ్ నాలుగో స్థానంలో నిలవడం ఒక్కటే ఈ టోర్నీలో భారత్‌కు మెరుగైన ప్రదర్శన. నిజానికి నీరజ్ తప్ప మిగిలిన వారిపై ఎక్కువ ఆశలు లేకపోయినా.. అతడి స్ఫూర్తితో ఎవరైనా పోడియంపై నిలుస్తారని అనుకున్నారు. పతకంపై ఆశలు రేపిన మురళీ శ్రీశంకర్, ప్రవీణ్ చిత్రవేల్ (లాంగ్‌జంప్), అన్నురాణి (జావెలిన్ త్రో), పారుల్ చౌదరి (3 వేల మీటర్ల స్టీపుల్‌ఛేజ్) కనీసం ఫైనల్ చేరలేకపోయారు. సచిన్ యాదవ్ కాకుండా సర్వేశ్ కుశారె (హైజంప్, 6వ స్థానం) మాత్రమే కాస్త చెప్పుకోదగ్గ ప్రదర్శన చేశాడు. గత ప్రపంచ ఛాంపియన్‌షిప్ (28 మంది)తో పోలిస్తే ఈసారి పోటీకి దిగిన భారత అథ్లెట్ల సంఖ్య (19 మంది) తగ్గిపోవడం కూడా ఆందోళన కలిగించేదే.


# ఫైనల్లో సాత్విక్ జంట



షెన్‌జెన్ (చైనా): సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి జంట చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచింది. జోరు కొనసాగిస్తూ భారత జోడీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం పురుషుల డబుల్స్ సెమీస్‌లో 2117, 2114తో ఆరోన్ చియాసో వీయ్ (మలేసియా) జోడీని ఓడించింది. తొలి గేమ్ నువ్వానేనా అన్నట్లు సాగింది. ఒక దశలో ఆరోన్ జంట 107తో ఆధిక్యం సాధించింది. ఈ స్థితి నుంచి భారత జంట పుంజుకుంది. 1814తో నిలవడమే కాక.. అదే జోరుతో గేమ్ గెలిచింది. రెండో గేమ్‌లో సాత్విక్ జంట విజృంభించింది. 82తో నిలిచింది. ప్రత్యర్థి పుంజుకున్నా.. భారత ద్వయం తగ్గలేదు. అదే ఊపులో గేమ్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆరోన్ జోడీతో ఇప్పటికి 16 మ్యాచ్‌లు ఆడిన సాత్విక్ జంటకు ఇది అయిదో విజయం మాత్రమే. భారత ద్వయానికి వరుసగా ఇది రెండో ఫైనల్. ఇటీవలే హాంకాంగ్ ఓపెన్లో తుదిపోరు చేరినా రన్నరప్‌గా నిలిచింది.

# సూర్య నిర్ణయం సరైందే: సన్నీ

దుబాయ్: ఆసియాకప్‌లో ఒమన్‌తో అప్రాధాన్య చివరి లీగ్ మ్యాచ్‌లో తాను బ్యాటింగ్‌కు దిగకూడదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తీసుకున్న నిర్ణయం సరైందేనని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అన్నాడు. ''సూర్య బ్యాటింగ్ చేస్తే కొన్ని ఫోర్లు, సిక్స్‌లు కొట్టేవాడే. కానీ పాకిస్థాన్‌పై అతడు ఆడిన తీరు చూస్తే ఇక ప్రాక్టీస్ అవసరం లేదనిపించింది. త్వరగా వికెట్లు పడితే కుల్‌దీప్, అర్ష్‌దీప్ లాంటి వాళ్లు ఒక్కోసారి బ్యాటింగ్ చేయాల్సి రావొచ్చు. అందుకే ఒమన్‌పై వాళ్లను కూడా బ్యాటింగ్‌కు పంపాడు'' అని సన్నీ తెలిపాడు. సూర్య కొత్తగా ఆలోచిస్తూ జట్టును ముందుకు నడిపిస్తున్నాడని అన్నాడు. ''సూర్య భిన్నంగా ఆలోచిస్తాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో అతడు స్వయంగా బంతిని అందుకోవడమే కాక.. రింకు సింగ్‌తో కూడా బౌలింగ్ వేయించాడు. ఈ ప్రయోగం ఫలించి మ్యాచ్‌ను మలుపు తిప్పింది'' అని సన్నీ తెలిపాడు.



# బంగ్లా..షేర్!



సూపర్ 4లో శుభారంభం
లంకపై విజయం

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో కష్టపడి గ్రూప్ దశ దాటిన బంగ్లాదేశ్.. సూపర్ 4 తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. శ్రీలంకను 4 వికెట్ల తేడాతో ఓడించి లీగ్ మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. శనివారం సైఫ్ హసన్ (61; 45 బంతుల్లో 2×4, 4×6), తౌహిద్ హృదోయ్ (58; 37 బంతుల్లో 4×4, 2×6) చెలరేగడంతో 169 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తంజిద్ (0) తొలి ఓవర్లోనే ఔటైనప్పటికీ.. లిటన్ (23), తౌహిద్‌లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన సైఫ్ జట్టు విజయానికి బాటలు పరిచాడు. సైఫ్ ఔటైనప్పటికీ.. తౌహిద్ దూకుడు కొనసాగించడంతో బంగ్లా విజయానికి చేరువైంది. ఆఖర్లో చకచకా 3 వికెట్లు పడ్డప్పటికీ ఆ జట్టుకు ఇబ్బంది లేకపోయింది. మొదట లంక 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. దసున్ శానక (64 నాటౌట్; 37 బంతుల్లో 3×4, 6×6) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు మెరుగైన స్కోరునందించాడు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ (3/20), మెహిదీ హసన్ (2/25) సత్తా చాటారు. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన శ్రీలంకకు కుశాల్ మెండిస్ (34), నిశాంక (22) శుభారంభాన్నందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 5 ఓవర్లలో 44 పరుగులు జోడించింది. అయితే ఓపెనర్లతో పాటు కామిల్ మిషార (5) తక్కువ వ్యవధిలో వెనుదిరగడంతో లంక 65/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో శానక పట్టుదలతో నిలిచాడు. మరో ఎండ్‌లో వికెట్ల పతనం కొనసాగుతున్నప్పటికీ.. అతను భారీ షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అసలంక (21)తో అతను అయిదో వికెట్‌కు 57 పరుగులు జోడించాడు.

శ్రీలంక: 168/7 (శానక 64 నాటౌట్, కుశాల్ మెండిస్ 34, నిశాంక 22, అసలంక 21; ముస్తాఫిజుర్ 3/20, మెహిదీ హసన్ 2/25)

బంగ్లాదేశ్: 19.5 ఓవర్లలో 169/6 (సైఫ్ హసన్ 61, తౌహిద్ హృదోయ్ 58, లిటన్ 23; హసరంగ 2/22)

వెల్లలాగే తిరిగొచ్చాడు

శ్రీలంక ఆల్‌రౌండర్ దునిత్ వెల్లలాగే తిరిగి శ్రీలంక జట్టుతో చేరాడు. గురువారం ఆసియా కప్‌లో అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్ ఆడుతున్నప్పుడు వెల్లలాగే తండ్రి సురంగ గుండెపోటుతో చనిపోయారు. వెంటనే స్వదేశం వెళ్లిన అతడు తండ్రి అంత్యక్రియలు పూర్తి కాగానే తిరిగి శుక్రవారం రాత్రి యూఏఈ చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో శనివారం సూపర్ 4 మ్యాచ్‌లో ఆడాడు. తాను దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న తండ్రి ఆశయానికి విలువ ఇస్తూ అతడు.. ఒక్క రోజు వ్యవధిలో స్వదేశం నుంచి బయల్దేరాడు. ఒకవైపు ఇంట్లో బంధువులు ఉండగానే.. కుటుంబ సభ్యులను ఓదార్చి అతడు యూఏఈ విమానం ఎక్కాడు. కుటుంబ సభ్యులకు వెల్లలాగే వీడ్కోలు చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది.